నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ సోమవారం 23 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ డే

ఇంజినీరింగ్ డేలో పాల్గొన్న విద్యార్థులు

బాసర, సెప్టెంబర్ 22 : బాసర ఆర్జీయూకేటీలో ఆదివారం ఇంజినీరింగ్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణ మాట్లాడుతూ.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజినీరింగ్ డేను నిర్వహించామని తెలిపారు. అదే విధంగా ఆయన చేసిన సేవలను వివరించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ రణధీర్‌సాగి, అసోసియేట్ డీన్స్ డాక్టర్ పావని, డాక్టర్ చంద్రశేఖర్, మహేశ్, అధికారులు పాల్గొన్నారు.

గిరిజన విద్యాభివృద్ధికి కృషి

పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మాత్యులు సీతక్క

ఉట్నూర్‌లో మంత్రికి స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

ఉట్నూర్, సెప్టెంబర్ 22 : గిరిజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మాత్యులు సీతక్క అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు స్వాగతం పలుకగా.. ఆవరణలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మంత్రి వెంట కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉన్నారు.

దళారుల దగా..

యథేచ్ఛగా బయో మందుల విక్రయాలు

- అధిక దిగుబడులంటూ అంటగడుతున్న బ్రోకర్లు
- నకిలీ విక్రయాలతో నష్టపోతున్న రైతులు
- లోపించిన అధికారుల పర్యవేక్షణ

ఆదిలాబాద్, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో బయో మందుల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ మందులు వాడితే పంట పెరుగుదలతోపాటు దిగుబడులు అధికంగా వస్తాయని కొందరు వ్యాపారులు నమ్మబలుకుతూ రైతులకు అంటగడుతున్నారు. బేల, జైనథ్ మండలాల్లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మహారాష్ట్ర నుంచి కొందరు దళారులు నకిలీ బయో మందులను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. వ్యాపారులు విత్తనాలు, ఎరువులను ఉద్దెరకు అమ్ముతున్నారు. దిగుబడులు వచ్చిన తర్వాత వారు తీసుకున్న విత్తనాలు, ఎరువుల డబ్బులను వడ్డీతోపాటు చెల్లిస్తారు. ప్రధానంగా ఉద్దెర తీసుకునే రైతులకు కొందరు దుకాణా వ్యాపారులు బలవంతంగా మందులను అంటగడుతున్నట్లు రైతు సంఘాల నాయకులు అంటున్నారు. గతంలో బేలలో నకిలీ బయో మందులు విక్రయిస్తున్న వారిని అధికారులు పట్టుకున్నారు.

లోపించిన పర్యవేక్షణ

గుట్టు చప్పుడు కాకుండా నకిలీ బయో మందుల విక్రయాలు కొనసాగుతుండగా.. వీటి అమ్మకాలపై అధికారుల పర్యవేక్షణ లోపించింది. పత్తి, కంది, మిర్చి, శెనగ, కూరగాయల పంటలకు ఈ మందులను వినియోగిస్తున్నారు. మహారాష్ట్రలో తక్కువ ధరకు బయో మందులను తీసుకొచ్చి రైతులకు అధిక ధరలకు అంటగడుతున్నారు. రైతుల వద్ద నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. బయో మందులు వాడితే పంట బాగా వస్తుందనే ఆశతో దళారులు, వ్యాపారుల మాటల నమ్మి రైతులు వాటిని పంటలకు వినియోగిస్తున్నారు. నకిలీ మందుల కారణంగా అధిక దిగుబడులు రాకపోగా రైతులు ఉన్న పంటను నష్టపోవాల్సి వస్తున్నది. మందుల్లో ప్రమాదకరమైన రసాయనాల వినియోగం కారణంగా భూసారం దెబ్బతినడమే కాకుండా పంట ఉత్పత్తుల వల్ల ప్రజల ఆరోగ్యం పాడవుతుంది. నకిలీ బయో మందుల విక్రయాలపై అధికారులు చర్యలు తీసుకుని రైతులు నష్టపోకుండా చూడాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

తలమడుగు మండలంలోని కోసాయి అండర్ బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న రైలు

ప్రకృతి ఒడిలో చుక్ చుక్..

చుట్టూ ఆకాశాన్నంటే ఎత్తయిన కొండలు, గుట్టలు.. పలు రకాల పంటలతో కొట్టొచ్చినట్టు కనిపించే పచ్చందాలు.. వీటి మధ్యన కనువిందు చేస్తున్న కోసాయి గ్రామం.. ఆ గ్రామాన్ని ఆనుకుని రైల్వే ట్రాక్.. ఆ ట్రాక్‌పై నీలి వర్ణంలో బుల్లెట్ వేగంతో దూసుకుపోయే రైలుబండి.. ఈ ప్రకృతి ఒడిలో నుంచి ఆ రైలు బండిలో ఒకసారి ప్రయాణిస్తే ఎలా ఉంటుందో ఒకసారి ఆలోచించండి.. మరీ ఆలస్యమెందుకు ఆ వివరాలు తెలుసుకుందామా.. మరీ వెళ్లొద్దామా..! తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో కోసాయి గ్రామం. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని కోసాయి-అంబారి మధ్య దక్షిణ మధ్య రైల్వే వారు నాందేడ్ డివిజన్‌లో భాగంగా ఏడు కిలోమీటర్ల పొడవున ఈ రైల్వే ట్రాక్‌ను నిర్మించారు. గ్రామ పరిధిలో దాదాపు అర కిలోమీటరు ట్రాక్ ఉంటుంది. కాగా.. ప్రస్తుతం అండర్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. దీంతో పంట పొలాలకు వెళ్లడానికి, రైలు సులువుగా వెళ్లడానికి ఈ బ్రిడ్జి ఉపయోగపడుతుంది.

- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, సెప్టెంబర్ 22

యువజనోత్సవాలకు రెడీ

- రేపటి నుంచి జిల్లాస్థాయి పోటీలు
- 11 అంశాల్లో నిర్వహణ.. హాజరుకానున్న ఎమ్మెల్యేలు..
- సాంస్కృతిక వేడుకలకు ముస్తాబైన ఎన్‌టీఆర్ స్టేడియం
- ప్రతిభ కనబరిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం

వేడుకలకు ముస్తాబైన ఎన్‌టీఆర్ మినీ స్టేడియం

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 22 : యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో రేపటి (ఈనెల 24) నుంచి జిల్లాస్థాయి యువజనోత్సవాలకు అధికారులు, యువజన, క్రీడల సర్వీసుల శాఖ ఏర్పాట్లను పూర్తి చేసింది. నిర్మల్ డివిజన్‌లోని 12 మండలాలు, భైంసా డివిజన్‌లోని ఏడు మండలాలకు చెందిన యువతీయువకులు 11 అంశాలలో ప్రతిభను ప్రదర్శించనున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారు జనవరిలో హైదరాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవుతారు. ఈనెల 24, 25వ తేదీలలో రెండు రోజులపాటు యువజన ఉత్సవాలను నిర్వహించనున్నారు. 24న సైన్స్ మేళాను స్థానిక తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించనున్నారు. ఇందులో 15 ఏండ్ల నుంచి 29 సంవత్సరాల వయస్సు గల వారు పాల్గొననున్నారు. ఈనెల 25న స్థానిక ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో సాంస్కృతిక పోటీలను నిర్వహింనున్నారు. పోటీల ప్రారంభోత్సవాలకు నిర్మల్, ముథోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు, కలెక్టర్ హాజరుకానున్నారు. యువజనోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా యువజన క్రీడా శాఖాధికారి శ్రీధర్ తెలిపారు.

పోటీలు జరిగే అంశాలు..

పదకొండు అంశాలలో కళాకారులకు పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో సైన్స్ మేళ, జానపద నృత్యం(గ్రూప్ డ్యాన్స్), జానపద నృత్యం(సోలో), జానపద గీతాలు (గ్రూప్), జానపద గీతాలు(సోలో), హస్తకళ, వస్త్ర కళ, ఆర్గో ఉత్పత్తులు, కథ రచయిత, పేయింటింగ్స్, ఎలక్యూషన్, కవిత్వం వంటి అంశాలలో పోటీలు ఉంటాయి.

పాల్గొనే వారి అర్హతలు..

- జిల్లా స్థాయిలో పాల్గొనే యువతీయువకులు నిర్మల్ జిల్లావాసులై ఉండాలి. 1-9-1995 నుంచి 31-08-2009 మధ్య జన్మించి ఉండాలి.
- గత మూడేండ్లుగా జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొన్న యువతీయువకులు ఈ పోటీల్లో పాల్గొనడానికి అనర్హులు.
- పోటీల్లో పాల్గొనే వారు వారి సామగ్రిని వారే తెచ్చుకోవాలి. ● ఫోక్ డ్యాన్స్ గ్రూపు నందు 10 మంది, ఫోక్ సాంగ్‌కు 15 నిమిషాల సమయం మాత్రమే ఉండాలి. ఇందులో జానపద నృత్యాలు, భారతీయ సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలి. ● జానపద నృత్యం సోలోలో ఒక్కో బృందంలో ఐదుగురు సభ్యులు ఉండాలి.
- జానపద గీతాలు గ్రూప్‌లో పది మంది.. సోలోలో ఐదుగురు మాత్రమే ఉండాలి.
- వ్యాసరచనలో ఎంపిక చేసిన అంశంపై 60 నిమిషాల్లో రాయాలి. కుల, మత, జాతి, రంగు, నమ్మకాలు కించపర్చకుండా 1000 పదాలలో వ్యాసాన్ని పూర్తి చేయాలి.
- కవిత్వం 60 నిమిషాలు మించరాదు. కుల, మత, జాతి, రంగు, నమ్మకాలు కించపర్చకుండా 500 పదాలు ఉండాలి.

వక్తృత్వ పోటీ : లాటరీ ద్వారా ఎంపిక చేసిన అంశంపై మూడు నిమిషాలు మించరాదు.
పేయింటింగ్ : 90 నిమిషాలు మించరాదు. ఏ3 పేపర్ మీద మాత్రమే వేయాలి.
యువక్రిటి : యువతీ యువకులకు దేశంలోని వివిధ ప్రాంతాలు, హస్త కళలను అర్థం చేసుకునేందుకు ప్రత్యేక అంశం ఇస్తారు. హస్త కళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల కేటగిరీలో ఇద్దరిని ఎంపిక చేస్తారు.

బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

నేరడిగొండ, సెప్టెంబర్ 22 : మండలంలోని కొర్టికల్-బి గ్రామానికి చెందిన తిత్రే చందర్ సింగ్ ఆదివారం బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా, ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీపై ప్రజలు పూర్తి విశ్వాసాన్ని కలిగి ఉన్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజల యోగక్షేమాలను గాలికి వదిలేశాయని విమర్శించారు. ఇప్పటికీ తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ అభిమానంతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్న వెంటే ఉంటానని చందర్‌సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, ప్రతాప్ సింగ్, సర్‌చంద్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 22 : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తోందని ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. చందూనాయక్ తండా గ్రామంలో ఆదివారం మధుర కులస్తులు రుషిపంచమి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ నగేశ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై గ్రామంలోని జ్వాలాముఖీ, కాలు బాబా ఆలయంలో గ్రామపెద్దలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సంస్కృతిక పాటలు ఆలపిస్తు కోలాటాలు వేశారు. యేటా కాలు బాబా జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ రుషిపంచమి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

పూజలు అందుకున్న విజయ దుర్గమ్మ

చింత చెట్టుకి దుర్గమ్మ రూపం

భైంసా టౌన్, సెప్టెంబర్ 22 : వానల్‌పాడ్ గ్రామంలో గల రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలో గల చింత చెట్టుకి శనివారం రాత్రి దుర్గమ్మ రూపం కనిపించింది. వివరాల్లోకి వెళితే.. ఆ గ్రామంలో నవరాత్రి ఉత్సవాలు ఇప్పటివరకు జరుపుకోలేదు. ఈ సంవత్సరం రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలో ఉత్సవాలను జరుపుకుందామని గ్రామస్తులు చర్చించుకున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు, యువకులు కలిసి ఆలయ పరిసరాలను చదును చేసే క్రమంలో చింత చెట్టుకి దుర్గమ్మ రూపం కనిపించింది. పండితులకు చూపించడంతో ఆ రూపం విజయ దుర్గమ్మ అని చెప్పడంతో గ్రామస్తులు పూజలు చేయడం ప్రారంభించారు. యేటా దుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తామని గ్రామస్తులు, వీడీసీ సభ్యులు తెలిపారు.

గోండి లిపి పండితుడి మృతి

కోట్నాక్ జంగు (ఫైల్)

నార్నూర్, సెప్టెంబర్ 22 : గుంజాల గ్రామానికి చెందిన కోట్నాక్ జంగు(77) గోండి లిపి పండితుడు అనారోగ్యంతో ఆదివారం వేకువజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కోట్నాక్ జంగు పక్షం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలు అందించామని, నయం కాకపోవడంతో పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. గోండిలిపికి ఎనలేని కృషి చేసిన పండితుడి మరణం గోండు సమాజానికి తీరని లోటని ఆదివాసీ అనుబంధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. కోట్నాక్ జంగు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కరెంట్ షాక్‌తో వృద్ధుడి మృతి

ఖానాపూర్ రూరల్, సెప్టెంబర్ 22 : ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన మేకల రాజమల్లు(63) ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. తమ పశువుల పాక కోసం విద్యుత్ తీగలను రాజమల్లు సరిచేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ సరాఫరా ఉన్న విద్యుత్ తీగలు తగిలి కుప్ప కులిపోయాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. రాజమల్లుకు కొడుకు, కూతురు ఉన్నారు. భార్య మేకల గంగవ్వ ఫిర్యాదు మేరకు ఖానాపూర్ ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖానాపూర్ పట్టణంలో నిధులు లేక నిలిచిన ప్రధాన రోడ్డు విస్తరణ పనులు

బిల్లులు రావు.. పనులు సాగవు

నిధుల విడుదల విషయంలో కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం

- తొమ్మిది నెలల్లో నయాపైసా మంజూరు చేయని ప్రభుత్వం
- నిర్మల్ జిల్లాలో ఎక్కడికక్కడ నిలిచిన పనులు ● ప్రజలకు తప్పని తిప్పలు

నిర్మల్, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లావ్యాప్తంగా తొమ్మిది నెలలుగా అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచాయి. కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి పనులకు అనుగుణంగా నిధులు మంజూరు చేస్తూ పనులను కొనసాగించేది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గతంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించకపోవడం ప్రధాన సమస్యగా మారింది. దీనికితోడు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులన్నింటినీ నిలిపి వేసి, విడుదలైన నిధులను వెనక్కి మళ్లించడం ప్రస్తుత విఘాతానికి కారణమవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వ విధానం కారణంగా రోడ్లు, మురుగు కాలువలు, వంతెనలతోపాటు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చేపట్టిన పనులన్నీ స్తంభించాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా పట్టణాలతోపాటు పల్లెల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, మున్సిపల్ అధికారులు తమ క్షేత్ర స్థాయి సిబ్బంది చేపట్టిన సర్వే ప్రకారం నష్టం అంచనాలు రూపొందించారు. నివేదికలను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. అయితే జరిగిన నష్టానికి అవసరమైన నిధులను మంజూరు చేయకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది.

మున్సిపాలిటీల్లో నిలిచిన పనులు

నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో గతంలో చేసిన పనుల బిల్లులు ఒక్కటి కూడా రాలేదంటున్నారు. నిర్మల్ మున్సిపాలిటీకి వచ్చే బిల్లులే రూ.18 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లులు రాకపోగా, కొత్త పనుల మంజూరు లేకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచాయి. గత కేసీఆర్ ప్రభుత్వం నిర్మల్ పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతోపాటు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు రూ.80 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి కొన్ని పనులు కూడా పూర్తయ్యాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా పనులను నిలిపివేయడంతోపాటు కొత్త పనులు చేపట్టకుండా నిధులను వెనక్కి మళ్లించింది. దీంతో ఇటీవల భారీ వర్షాలకు చెడిపోయిన రోడ్లకు మరమ్మతులు కూడా చేయలేని పరిస్థితి నెలకున్నది. ఇదిలాఉంటే జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో సిబ్బంది జీతభత్యాలు, విద్యుత్ బిల్లులకు ఇబ్బంది పడాల్సి వస్తున్నది. చివరికి చెత్త సేకరణకు వినియోగించే వాహనాల్లో డీజిల్ పోయించే పరిస్థితి లేక రెండు మూడు రోజులకు ఒకసారి చెత్త సేకరణ చేసే పరిస్థితి నెలకున్నది. ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్సులు, భవన నిర్మాణ అనుమతుల ఫీజు వంటి వాటి నిధుల నుంచి వచ్చే ఆదాయంతోనే సిబ్బంది వేతనాలు, పారిశుధ్య నిర్వహణ, కరెంటు బిల్లుల చెల్లింపులు చేయాల్సి వస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రవేశపెట్టిన ప్రజాపాలన, స్వచ్ఛదనం-పచ్చదనం, సీజనల్ వ్యాధుల నివారణ, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు నిధులు మంజూరు లేకపోవడంపై అధికారులే పెదవి విరుస్తున్నారు.

పంచాయతీరాజ్ శాఖకు రూపాయి రాలే..

పంచాయతీరాజ్ శాఖ పరిధిలో జిల్లా వ్యాప్తంగా చెడిపోయిన పీఆర్ రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల వంతెనల కోసం నయాపైసా రాలేదంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.70 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ఒక్క ఎన్ఆర్ఈజీఎస్‌కు సంబంధించిన బకాయిలే రూ.50 కోట్ల వరకు ఉండగా, 'మన ఊరు-మన బడి' కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనుల రూ.10 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఇతర రోడ్లకు సంబంధించి మరో రూ.10 కోట్ల వరకు కాంట్రాక్టర్లకు రావాల్సి ఉన్నది. కాగా.. ఇటీవలి భారీ వర్షాల కారణంగా చెడిపోయిన 130 రోడ్లను బాగు చేసేందుకు రూ.11 కోట్ల అంచనాలతో అధికారులు నివేదించినప్పటికీ నేటికీ ప్రభుత్వ ఆమోదం లభించలేదు. అలాగే ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి మరో రూ.25 కోట్లతో ప్రతిపాదనలు పంపినప్పటికీ సర్కారు నుంచి స్పందన లేదు. ఒకవైపు చేసిన పనులకు సంబంధించి బిల్లులు రాకపోవడం.. మరోవైపు కొత్త పనులు మంజూరు కాకపోవడంతో అభివృద్ధి పూర్తిగా స్తంభించిపోయిందంటున్నారు.

ఆర్అండ్‌బీ శాఖలో అదే పరిస్థితి..

జిల్లా రోడ్లు భవనాల శాఖలో పరిస్థితి అధ్వానంగా ఉన్నది. గతంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని స్వయంగా ఉన్నతాధికారులే పేర్కొంటుండడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

నిర్మల్‌లోని ప్రియదర్శిని నగర్ కాలనీలో గుంతలమయంగా మారిన రోడ్డు

చిన్న చిన్న మరమ్మతు పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని వాపోతున్నారు. దీనికి ప్రధాన కారణం గతంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులను ప్రభుత్వం విడుదల చేయకపోవడమేనంటున్నారు. ఆర్అండ్‌బీ పరిధిలో జిల్లా వ్యాప్తంగా చేసిన వివిధ పనులకు సంబంధించి రూ.36 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో గత ఏడాది కాలంగా భారీ వర్షాలు, వరదలతో కొట్టుకుపోయిన రోడ్లు, వంతెనలతోపాటు కొత్తగా అవసరమైన రోడ్ల కోసం రూ.100 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ నేటికీ ఆమోదం లభించలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2 కోట్లతో మూడు చోట్ల చిన్న వంతెనలు, ఒక రోడ్డు పనిని ప్రారంభించినప్పటికీ ప్రభుత్వం నుంచి రూపాయి కూడా రాలేదంటున్నారు.